పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

హిమాయత్‌నగర్, అక్టోబర్ 24: ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్-16 ఏఎం హెచ్‌వో డాక్టర్ హేమలత అన్నారు. తడి,పొడి చెత్తను వేర్వేరుగా స్వచ్ఛ ఆటోల్లోనే వేయాలని గురువారం హిమాయత్‌నగర్‌లో బైక్ ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్తను స్వచ్ఛ ఆటోల్లో వేయాలని, బహిరంగ ప్రదేశాల్లో వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రభుత్వ భూములను కాపాడాలని వినతి

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 24 : ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ బీజేపీ నాయకులు గురువారం శంషాబాద్ తహసీల్దార్ రవీందర్ దత్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శంషాబాద్ మున్సిపాలిటీలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పట్టణంలోని సర్వే నంబర్ 626/1లో ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నట్లు తహసీల్దార్‌కు వివరించారు. మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, ప్రేమ్‌రాజ్, ఎన్. కుమార్, మహిపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మెండే కుమార్ తదితరులు ఉన్నారు.

ఆర్ఐ విచారణ

కాగా సర్వే నంబర్ 626/1లో ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నిస్తున్న కేశవనాయుడిపై రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు గురువారం విచారణ జరిపినట్లు ఆర్ఐ కృష్ణ తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

జూబ్లీహిల్స్‌లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

- ప్రధాన రహదారిపై మరమ్మతుల పేరుతో బహుళ అంతస్తుల నిర్మాణం
- చోద్యం చూస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

బంజారాహిల్స్,అక్టోబర్ 24:మారుమూల కాలనీలో ఎవరైనా తమ భవనంపై చిన్న షెడ్డు వేసుకుంటేనే గద్దల్లా వాలిపోయే టౌన్‌ప్లానింగ్ అధికారులు తమ కళ్లకు గంతలు కట్టుకున్నారు.. నిత్యం వేలాదిమంది ప్రయాణించే రహదారిపై మూడునెలలుగా ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తుంటే అందినకాడికి దండుకుని సైడయిపోయినట్లు విమర్శలు వెల్లువుత్తున్నాయి..

వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ సర్కిల్ -18 పరిధి జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్-కృష్ణానగర్ ప్రధాన రహదారిపై మంగా టిఫిన్స్ పేరుతో హోటల్‌తోపాటు వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. సుమారు 400 గజాల స్థలంలో జీ ప్లస్-1 భవనంలో గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం షట్టర్లు వేసి కమర్షియల్ యాక్టివిటీస్ నిర్వహిస్తున్నారు. ఇటీవల మరమ్మతుల పేరుతో ఆ ఇంటి యజమాని భారీ అక్రమ నిర్మాణాన్ని ప్రారంభించారు. కొత్తగా అనుమతులు తీసుకుంటే మెయిన్ రోడ్డు మీద మాస్టర్ ప్లాన్‌కు కొంతస్థలాన్ని వదలిపెట్టడంతోపాటు నాలుగువైపులా సెట్‌బ్యాక్స్ కోసం మరికొంత స్థలం వదలాల్సి ఉంటుందని భావించి ఎలాంటి అనుమతులు లేకుండానే భవన నిర్మాణపనులు ప్రారంభించారు. కనీసం ఒక్క అడుగు సెట్‌బ్యాక్ స్థలాన్ని కూడా వదలకుండా పాత షట్టర్లను అలాగే ఉంచి నాలుగు ఫ్లోర్లలో భవనం నిర్మిస్తున్నాడు. దీనిపై స్థానికులు ఫిర్యాదులు చేయడంతో టౌన్‌ప్లానింగ్ సిబ్బంది హడావిడి చేసి భారీ మొత్తంలో డబ్బు తీసుకుని వెళ్లిపోయినట్లు సర్వత్రా విమర్శలున్నాయి. ఇదిలా ఉంటే జలమండలి అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి అదనంగా ఓ నల్లా కనెక్షన్ కూడా తీసుకున్నారు. తాజాగా ప్రజావాణిలో సైతం స్థానికులు ఈ అక్రమ నిర్మాణంపై జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో మరోసారి వ్యవహారం తెరపైకి వచ్చింది. ఈ మొత్తం వ్యవహారంలో కొంత మంది అధికార పార్టీ నాయకులు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలుస్తున్నది.

అదేవిధంగా ఇందిరానగర్‌లోని ప్రియాంక వైన్స్ వెనుక సుమారు 1200 గజాల్లో సుమారు ఆరంతస్తుల్లో అక్రమ నిర్మాణం చేపడుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బస్తీవాసుల భద్రతకు ముప్పుగా పెద్దఎత్తున అక్రమ నిర్మాణం కొనసాగుతుంటే జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో పాటు విజిలెన్స్ అధికారులు ఏం చేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సర్కిల్-18లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని వారు కోరుతున్నారు.

జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్ ప్రధాన రహదారిపై మరమ్మతుల ముసుగులో కొనసాగుతున్న అక్రమ నిర్మాణం

ఇందిరానగర్ ప్రియాంక వైన్స్ వెనుక అక్రమంగా నిర్మిస్తున్న భారీ బహుళ అంతస్తుల నిర్మాణం

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లోని మంగా టిఫిన్స్ భవనంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్న విషయాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. గతంలో రెసిడెన్షియల్‌గా ఉన్న భవనంపై అదనపు అంతస్తులు వేయడానికి ఖచ్చితంగా అనుమతులు తీసుకోవాలి. దీంతో పాటు నిర్దేశిత ప్రమాణాలు పాటించడంతో పాటు సెట్‌బ్యాక్స్ వదలాలి. ఈ రోడ్డుమీద ఎలాంటి కమర్షియల్ బిల్డింగ్ నిర్మాణానికి మేము అనుమతి ఇవ్వలేదు. అక్రమ నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే వెంటనే పనులు నిలిపి వేయిస్తాం.

-శ్రీనివాస్, సర్కిల్-18 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ

ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లోకి మార్చాలి

బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న డాక్టర్ శంకర్ ముదిరాజ్ తదితరులు

హిమాయత్‌నగర్,అక్టోబర్ 24: రాష్ట్రంలోని ముదిరాజ్ కులస్తులకు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీ మేరకు బీసీ 'ఏ'లోకి మార్చాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించి, వారి అభ్యున్నతికి చొరవ చూపాలని కోరుతూ గురువారం బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం హైదర్‌గూడలోని మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముదిరాజ్‌ల సామాజిక, ఆర్థిక స్థితిగతులను అర్థం చేసుకుని 2009లో అప్పటి సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏ లోకి మార్చుతూ జీవో విడుదల చేసినట్లు పేర్కొన్నారు. అయితే కొన్ని బీసీ కులాలు కోర్టుకు వెళ్లడంతో ఆ జీవోను నిలిపి వేసినట్లు తెలిపారు. ఈ విషయమై బీసీ కమిషన్ నివేదికను కోరాయని, అందుకే బీసీ కమిషనర్‌ను కలిసి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ముదిరాజ్, ముతరాసి, తెనుగు, బంటు, కోలి, కావలి వంటి వర్గాలను ముదిరాజ్ కులస్తులుగా పరిగణించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు అందె బాలయ్య, వీకే మహేశ్, భద్రయ్య, వెంకట్, సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు సలేంద్ర శివయ్య, సంతోష్, నాయకులు రమేశ్, రాంబనేశ్, సంపత్, బీఆర్ బిందుశ్రీ, సిద్దేశ్వర్, రాజు, బలరాం, కేశవులు, యుద్ధవీర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను పాతాళానికి తొక్కేస్తాం..

- మూసీ బాధితుల సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

అత్తాపూర్ మూసీ బాధితుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 24: మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చేందుకు యత్నిస్తే కాంగ్రెస్‌ను పాతాళానికి తొక్కేస్తామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం అత్తాపూర్ డివిజన్ భరత్‌నగర్‌లో హైడ్రా బాధితులతో నిర్వహించిన సమావేశంలో అదిలాబాద్ ఎమ్మెల్యే పాయాల శంకర్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏదో మేలు చేస్తాడని ప్రజలు అధికారం ఇస్తే పేదల ఇండ్లు కూల్చుతున్నాడని విమర్శించారు. టీకేఆర్ నగర్, భరత్‌నగర్‌లో హైడ్రా బాధితుల ప్రాంతంలోని ఇండ్లను కూల్చివేస్తామంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఇక్కడి ప్రజలకు భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని, న్యాయం జరిగే వరకు పోరాడుతామని వారికి హామీ ఇచ్చారు. ఉన్నతాధికారులు, ప్రభుత్వమే గత వారి ఇళ్లకు అనుమతి ఇచ్చిందన్నారు. హైదరాబాద్‌లోని మురికి నీరంతా వచ్చి మూసీలో కలుస్తున్నదని, ఎస్‌టీపీలు నిర్మించి ఫిల్టర్ చేసి పైపులైన్ ద్వారా ఆ నీటిని మూసీలోకి వదిలిపెట్టాలన్నారు. కానీ ఆ ప్రక్రియ ఎక్కడ కూడా మొదలు పెట్టకుండా కట్టుకున్న ఇళ్లను కులుస్తాం అంటూ బెదిరించడం సరైన పద్ధతి కాదన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వమే రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేలా వ్యవహరిస్తుందన్నారు. అసలు మూసీకి సంబంధించిన డీపీఆర్ ప్రభుత్వం దగ్గర సిద్ధంగా ఉందా? అని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు అండగా నిలుస్తున్న బీజేపీపై ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. ప్రజలకు న్యాయం జరిగేంత వరకు బీజేపీ ఉద్యమిస్తుందన్నారు. సమావేశంలో మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, అత్తాపూర్ కార్పొరేటర్ సంగీతా గౌరీశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, కొమురయ్య, మల్లారెడ్డి, మల్లేశ్‌యాదవ్, మహేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసనను విజయవంతం చేయాలి

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 24 : తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా నాయకుడు నీరటి మల్లేశ్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం పని బంద్ చేసిన నిరసన తెలుపుతామని వివరించారు. కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు రూ. 26 వేల కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస మౌలిక సదుపాయలు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో కార్మికులు డి నాగేశ్, ప్రవీణ్, రవి, దశరథ్, సాగర్, గోపాల్, సత్తయ్య, చంద్రయ్య, ఖదిర్, సంపత్ రాజు, యాదగిరి, సంజీవ ఉన్నారు.

రాష్ట్రంలో మైనార్టీలపై దాడులను నిలువరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న సరా మాథ్యూస్ తదితరులు

ఖైరతాబాద్, అక్టోబర్ 24 : రాష్ట్రంలో మైనార్టీలపై జరుగుతున్న వరుస దాడులను నిలువరించాలని సామాజిక కార్యకర్తలు ఖలిదా పర్వీన్, సరా మ్యాథ్యూస్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మతపరమైన హింసలు విపరీతంగా పెరిగాయని, స్వయంగా ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ముస్లింల మతపరమైన నిర్మాణాలపై వివాదాలు చెలరేగాయన్నారు. కాంగ్రెస్ సెక్యూలర్ పార్టీ అని నమ్మి యావత్ ముస్లింలందరూ ఆ పార్టీకి ఓట్లు వేసి గెలిపించారని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ నిర్వచనాన్ని విస్మరించిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం కావస్తుందని, ఈ సమయంలో సుమారు 20 గ్రామాల్లో మతపరమైన హింసలు జరిగాయన్నారు. ఓ ఆదివాసీ మహిళపై లైంగిక దాడి ఘటనలో ఒక వర్గాన్ని బాధ్యులను చేస్తూ వారికి సంబంధించిన ఆస్తులను ధ్వంసం చేశారన్నారు. జరిగిన ఘటనలపై హైకోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని, మైనార్టీలను ఇతర వర్గాల దాడి నుంచి కాపాడాలని, కర్ణాటకలో తీసుకువచ్చిన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో సామాజిక కార్యకర్తలు ఎంఏ షకీల్, మాజిద్ షుట్టారి, అన్సార్, అలీంఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

మధుబన్‌కాలనీలో ఫుట్‌పాత్‌పై నిర్మించిన దుకాణాలను జేసీబీ సాయంతో తొలగిస్తున్న అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 24: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మధుబన్‌కాలనీలో రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి కొందరు వాణిజ్య సముదాయాలు నిర్మించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. దాంతో రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ ఉపకమిషనర్ రవికుమార్ ఆదేశాల మేరకు గురువారం టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ నేతృత్వంలో అధికారులు పోలీస్ బందోబస్తు నడుమ ఆక్రమణలను జేసీబీ సాయంతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా అధికారులు, దుకాణాల యజమానులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. పోలీసులు వారిని నిలువరించి కూల్చివేతలను కొనసాగించారు. రోడ్డు పక్కన చిన్న డబ్బాలను ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్నామని, వాటిని అధికారులు కూల్చివేయడంతో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని పలువురు చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపకమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ.. ప్రజల అవసరాల నిమిత్తం పుట్‌పాత్‌లను ఏర్పాటు చేశారని అన్నారు. అయితే కొందరు పుట్‌పాత్‌లను ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్నారని, దాంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. గత వారం ప్రజావాణి కార్యక్రమంలో మధుబన్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు లిఖితపూర్వంగా పుట్‌పాత్‌ల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. మరోసారి ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కూల్చివేతల్లో టౌన్‌ప్లానింగ్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

నిషేధిత వస్తువులు అమ్మితే కఠిన చర్యలు

శంషాబాద్‌లో వాహనాలను తనిఖీ చేస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు, తదితరులు

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 24 : నిషేధిత వస్తువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం సాయంత్రం శంషాబాద్ పట్టణంలోని వివిధ దుకాణాలు, పాన్‌షాపులు, వాహనాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రధానంగా దుకాణాలు, పాన్‌షాపుల్లో నిషేధిత వస్తువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. వాహన దారులు తమ వాహనాలకు సంబంధించి అన్ని పత్రాలు చూపాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి కుటుంబ పెద్దలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు తెలిపారు. తనిఖీల్లో ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

బండ్లగూడ, అక్టోబర్ 24 : నారద క్విజ్ పోటీల్లో రాజేంద్రనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కార్పొరేట్ కళాశాలకు ఏమాత్రం తీసిపోకుండా ఎంపీసీలో 10 మంది, బైపీసీలో 8మంది, సీఈసీలో ముగ్గురు, ఒకేషనల్ నుంచి ఒకరు ఉత్తీర్ణత సాధించినట్లు నారద క్విజ్ బోర్డ్ వెల్లడించింది. ఉత్తీర్ణత సాధించిన వారిలో ఎంపీసీ నుంచి అమీ నా ఇఫ్ఫత్ మొదటి బహుమతి, శశాంత్‌కు రెండో బహుమతి, మౌనిక మూడో బహుమతి, బైపీసీ నుంచి ఐనబ్ బేగం మొదటి బహుమతి, శ్వేత రెండో బహుమతి, అమన్ మూడో బహుమతి, సీఈసీ నుంచి కె.అశ్విని మొదటి బహుమతి, కె.కావ్య రెండో బహుమతి, చరణ్ మూడో బహుమతి, ఒకేషనల్ నుంచి పి.శివలీల మొదటి బహుమతి గెలుచుకున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి, వైస్ ప్రిన్సిపాల్ శ్యామ్ సుందర్ వెల్లడించారు.

వాక్సిన్ కోసం వచ్చిన తల్లీబిడ్డ అదృశ్యం

బంజారాహిల్స్,అక్టోబర్ 24: దవాఖానలో కుమార్తెకు వాక్సిన్ వేయించేందుకు వచ్చిన వివాహిత తన కుమార్తెతో కలిసి అదృశ్యమైన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్‌కు చెందిన ఖాజా ఇలియాజ్ అహ్మద్ ఈనెల 21న తన సోదరి నిషా ఫిర్‌దౌస్‌తో కలిసి ఆమె నాలుగేళ్ల కుమార్తెకు వాక్సిన్ వేయించేందుకు బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో ఆస్పత్రికి వచ్చారు. సోదరి నిషా ఫిర్‌దౌస్, ఆమె కుమార్తెను గేటు వద్ద దింపిన ఇలియాజ్ కారు పార్కింగ్ చేసేందుకు సెల్లార్‌లోకి వెళ్లాడు. కారు పార్క్ చేసి రాగా సోదరి నుంచి తాను వాష్‌రూమ్‌లో ఉన్నానంటూ సెల్‌కు మెసేజ్ వచ్చింది. దాంతో ఆమె కోసం వేచి ఉండగా ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో ఆస్పత్రి మొత్తం గాలించాడు. తెలిసిన వారికి ఫోన్లు చేసినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో బుధవారం రాత్రి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రొఫెసర్‌పై దాడి..

ఖైరతాబాద్, అక్టోబర్ 24 : షాదన్ కళాశాలలో ప్రొఫెసర్ల మధ్య గొడవ దాడులకు దారి తీసింది. ఈ ఘటన సైఫాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఖైరతాబాద్‌లోని షాదన్ కళాశాలలో ప్రొఫెసర్ సెంథల్ సింగ్‌పై గురువారం కొందరు యువకులు దాడి చేసి తీవ్రంగా కొట్టారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ ఇక్బాల్ ఖాద్రి కొడుకుతోపాటు మరో ఐదుగురు యువకులు తనను బయటకు లాగి తీవ్రంగా కొట్టినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్టు

ఖైరతాబాద్, అక్టోబర్ 24 : ఇంట్లో చార్జింగ్ పెట్టిన ఫోన్‌ను అపహరించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పోచమ్మబస్తీకి చెందిన ఫణి తన ఇంట్లో సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టాడు. అదే బస్తీకి చెందిన సాయి(28) అనే యువకుడు అదును చూసి ఇంట్లోకి చొరబడి సెల్‌ఫోన్‌ను అపహరించాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఐఎంఈఐ, సెల్‌ఫోన్ సిగ్నళ్ల ఆధారంగా నిందితుడు సాయిని గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వ్యవసాయ వర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తా..

- నూతన వైస్‌చాన్స్‌లర్ జానయ్య

సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జానయ్య, పాల్గొన్న ఉద్యోగులు, విద్యార్థులు

వ్యవసాయ యూనివర్సిటీ, అక్టోబర్ 24 : వర్సిటీ నిబంధనలకు అనుగుణంగా పని చేస్తూ, మంచి ఫలితాలు సాధించడానికి అంతా కృషి చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ నూతన వైస్‌చాన్స్‌లర్ జానయ్య అన్నారు. గురువారం రాజేంద్రనగర్‌లోని వర్సిటీ ఆడిటోరియంలో ఉద్యోగులు, విద్యార్థులతో ఏర్పాటు చేసిన తొలి సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నదన్నారు. తదనుగుణంగానే యూనివర్సిటీకి కొత్త మార్పులు తీసుకురానున్నట్లు తెలిపారు.

ఇటీవల గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో జరిగిన సమావేశంలో వర్సిటీలో పరిశోధన, విద్య, విస్తరణలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించినట్లు పేర్కొన్నారు. ప్రణాళికాబద్ధంగా జనవరి 2025 లోగా వర్సిటీలోని సమస్యలు, ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. యూనివర్సిటీ అభివృద్ధి తన జన్మహక్కుగా భావిస్తానని హామీ ఇచ్చారు. పెండిగ్‌లో ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. సాంకేతిక అర్హత లేకపోయినా కొన్ని ప్రైవేటు సంస్థలు వ్యవసాయ కోర్సుల్లో ప్రవేశాలు చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డు, స్కాలర్స్, పీహెచ్‌డీ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సమస్యలు త్వరలోనే పరిష్కారం కానున్నాయన్నారు. ఈ ఏడాది వర్సిటీకి దేశవ్యాప్తంగా 37వ ర్యాంకు ఉండగా త్వరలో 10 ర్యాంకు వచ్చేలా కృషి చేయాలని వీసీ సూచించారు. గ్రామీణ విద్యార్థులకు వ్యవసాయ విద్యను చేయడానికి రూ.10 లక్షల ఫీజును రూ. 5 లక్షలకు తగ్గించి మరో 200 సీట్లు పెంచారని ఆయన పేర్కొన్నారు. 1964 నుంచి యూనివర్సిటీ కొనసాగుతుందని, ఈసారి వజ్రోత్సవం నిర్వహిస్తామని ప్రకటించారు. అంతకుముందు టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘాల, విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు.

రహ్మత్‌నగర్ జంక్షన్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

జూబ్లీహిల్స్, అక్టోబర్ 24 : రహ్మత్‌నగర్ జంక్షన్‌లో అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానిక వ్యాపారులు కార్పొరేటర్ సీఎన్ రెడ్డిని కోరారు. ఈ మేరకు గురువారం రహ్మత్‌నగర్ డివిజన్‌లోని కార్యాలయంలో కార్పొరేటర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వ్యాపారులతో కలిసి రహ్మత్‌నగర్ కూడలిలో పర్యటించి రోడ్డు వెడల్పు చేయాల్సిన ప్రాంతాలను పరిశీలించారు.

పెండింగ్ పనులపై సమావేశం

రహ్మత్‌నగర్‌లో పెండింగ్ పనులపై కార్పొరేటర్ సీఎన్ రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులతో సమావేశమయ్యారు. సీసీ రోడ్లతో పాటు పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ భరత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వణిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఐక్యరాజ్యసమితి మాదిరి సమావేశాలు



మోడల్ ఐక్యరాజ్యసమితి ప్రసంగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

బంజారాహిల్స్, అక్టోబర్ 24: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో రెండురోజుల పాటు నిర్వహించిన ఐక్యరాజ్యసమితి మాదిరి సదస్సు గురువారం ముగిసింది. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు ప్రపంచం ఎదుర్కొంటున్న సైబర్ ఉగ్రవాదం, శాంతిభద్రతలపై ప్రభావం, ట్రిపుల్ ప్లానెటరీ సంక్షోభం, మహిళల భద్రత, లాటిన్ అమెరికన్ డ్రగ్ ట్రాఫికింగ్, స్పేస్ మిలటరైజేషన్, ప్రపంచ భద్రత తదితర అంశాలపై నగరంలోని పలు పాఠశాలలకు చెందిన 250 మంది విద్యార్థులు పాల్గొని ప్రసంగించారు. ఆయా అంశాలపై చర్చావేదికలు నిర్వహించడంతోపాటు ముసాయిదా తీర్మానాలు చేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థు లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేహెచ్‌పీఎస్ డైరెక్టర్ ఎం.వరలక్ష్మి, ప్రిన్స్‌పాల్ కాంచనవల్లి తదితరులు పాల్గొన్నారు.

దేశాలను ఏకం చేసేందుకు ఐక్యరాజ్యసమితి కృషి

హిమాయత్‌నగర్ : దేశాలన్నింటినీ ఏకతాటిపైకి తెచ్చేందుకు ఐక్యరాజ్య సమితి కృషి చేస్తున్నదని బాబు జగ్జీవన్‌రామ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ వెంకటరమణ అన్నారు. ఐక్యరాజ్య సమితి వ్యవస్థాపన వేడుకలను గురువారం నారాయణగూడలోని బీజేఆర్ డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ శాంతిని కాపాడటం, దేశాల మధ్య స్నేహపూర్వకంగా సంబంధాల పెంపునకు ఐక్యరాజ్య సమితి కృషి చేస్తుందన్నారు.

కార్యక్ర మంలో అధ్యాపకులు డాక్టర్ భిక్షపతి, డాక్టర్ నాగర త్నమ్మ, డాక్టర్ ఆదాము, డాక్టర్ గోవింద్, డాక్టర్ గీత, మాధవచారి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

వెంగళరావునగర్, అక్టోబర్ 24: ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్‌లోని స్ఫూర్తి మహిళా సంఘం 4వ వార్షికోత్సవ వేడుకలను గురువారం సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది అంధులు, దివ్యాంగులకు ఒక్కొక్కరికీ రూ.2000 విలువ చేసే నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకురాలు ఝాన్సీ, సభ్యులు రత్న, సూర్యకళ, లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో పోలీసులపై యువకుల దాడి

బంజారాహిల్స్, అక్టోబర్ 24 : అర్ధరాత్రి మద్యం మత్తులో రోడ్డుపై తిరుగుతున్న ముగ్గురు యువకులు అక్కడికి వచ్చిన పెట్రోలింగ్ పోలీసులపై దాడికి పాల్పడిన ఘటన జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... శాలివాహన నగర్ ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జూబ్లీహిల్స్ పోలీస్ కానిస్టేబుల్ రాజు, హోంగార్డు శేఖర్ పెట్రోలింగ్ చేస్తున్నారు. మద్యం సేవించి రోడ్డు పక్కన బాతాఖానీ వేస్తున్న కార్తిక్, అశోక్ అన్నదమ్ములతో పాటు వారి స్నేహితుడు మోహన్‌ను గమనించిన పోలీసులు ఇక్కడ ఏం చేస్తున్నారంటూ ప్రశ్నించి ఇంటికి వెళ్లాలని సూచించారు. అప్పటికే పూటుగా మద్యం సేవించి ఉన్న ముగ్గురు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.

మాటా మాటా పెరగడంతో ఆగ్రహానికి గురైన ఆ ముగ్గురు పోలీసులపై తీవ్రంగా దాడి చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు నిందితులు ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించారు. కార్తిక్ డీజే ప్లేయర్‌గా పనిచేస్తుండగా, అశోక్, మోహన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నట్లు తేలింది. నిందితులపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

శంషాబాద్ రూరల్ : శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలం తొండుపల్లి వద్ద సుమారు 65 ఏండ్ల వయస్సున్న ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు సమాచారం అందడంతో వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. అప్పటికే ఆ వ్యక్తి మరణించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించినట్లు తెలిపారు.

PUBLIC NOTICE

The General Public is hereby informed that, Vinay Garg S/o Subhash Chander, is the absolute owner of all that all that the Part and parcel of the House on Plot No 2 admeasuring 218 Sq. Yd or 182.25 Sq. Mt., forming part of approved Layout in Sy.No. 155 Part, 176 and 176/B situated at Kompally Village, Quthbullapur Mandal, Ranga Reddy District., having purchased the same under a Registered Sale Deed Doc. No. 6734/2005 dated 26-05-2005, and also an Agreement for Construction of a House dated 26-05-2005 and Vinay Garg S/o Subhash Chander has availed a Credit facility from Kotak Mahindra Bank by Mortgaging the above said Property, and during handling of the documents, last two pages of the Construction Agreement dated 26-05-2005, are misplaced and lost irretrievably.

Finders of the said two pages of the said document may contact the undersigned within 7 days and hand over the same to the undersigned. It is hereby cautioned the General Public to not to deal with the above said Property. If any person/s or anybody deal with the said Sale Deed and Property, they will be doing so at their own Cost and Consequences.

Sd/- PRASADA RAO APKARI
ADVOCATE
Flat No. 103, Krishna Reddy Villa, Block B, H.No. 1-11-271/D1/103B, Gaganvihar Colony, Bhagawantapuram, Begumpet, Hyderabad.
email: advprasada.apkari@outlook.com;
Mobile: 9582795964, 8106795964, 040-35941590